## కొడుకులు పట్టించుకోని వృద్ధ తల్లికి న్యాయం

భువనగిరి అర్బన్, మే 16 : కొడుకులు తన బాగోగులు చూడకపోవడంతో వృద్ధాశ్రమంలో ఉంటున్న ఓ తల్లికి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత న్యాయం చేశారు. భువనగిరిలోని కోర్టు ఆవరణలో శుక్రవారం జరిగిన లోక్ అదాలత్‌లో ఆమె తీర్పు ఇచ్చారు. ఆమె ఇద్దరి కొడుకులను పిలిచి ప్రతి నెలా రూ.20వేలు తల్లికి ఇస్తూ బాగోగులు చూసుకోవాలని సూచించారు. భువనగిరి మండలం చీమలకొండూర్ సమీపంలో గల బెజ్జ లక్ష్మయ్య ఫౌండేషన్ వయోవృద్ధుల ఆశ్రమంలో ఒక వృద్ధురాలు వారం రోజుల క్రితం తమ కొడుకులు బాగోగులు చూడడం లేదని లోక్ అదాలత్‌లో దరఖాస్తు చేసుకుంది. దీంతో వృద్ధురాలి ఇద్దరు కొడుకులను శుక్రవారం లోక్ అదాలత్‌కు పిలిపించారు. వారితో చర్చించి వృద్ధాశ్రమంలో అయ్యే ఖర్చు కోసం ఒక్కొక్కరు రూ.10వేలు చొప్పున నెలకు రూ. 20 వేలు ఇవ్వాలని న్యాయ సేవ అధికార సంస్థ మాధవిలత ప్రి లిటిగేషన్ వ్యాజ్యముగా పరిష్కరించారు. అనంతరం లోక్ అదాలత్ న్యాయమూర్తి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఉషశ్రీ అవార్డు జారీ చేశారు. ఏదేని కోర్టు ముందుకు, ఫోరమ్ ముందుకు రాని సివిల్ తగాదాలను ప్రి లిటిగేషన్ వ్యాజ్యాలుగా పరిష్కరించుకోవచ్చని మాధవీలత తెలిపారు. ఈ నెల 20న అసంఘటిత, సంఘటిత కార్మికులకు జిల్లా కార్మిక శాఖ ద్వారా ఉచిత వైద్య శిబిరం, అవగాహన సదస్సు కోర్టు ఆవరణలో నిర్వహించనున్నారని చెప్పారు.


నమస్తే తెలంగాణ

# నల్లగొండ

I | నల్లగొండ, శనివారం 17 మే 2025 | NALGONDA




అనుమానితుల వివరాలు పరిశీలిస్తున్న నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్

## మాన్యంచెల్కలో కార్డన్ సెర్చ్

- గురువారం రాత్రి 11 నుంచి శుక్రవారం ఉదయం 7 గంటల వరకు తనిఖీలు
- నలుగురు రౌడీషీటర్లు, 30 మంది అనుమానితులను అదుపులోకి..
- పత్రాలు సరిగ్గా లేని పలు వాహనాలు సీజ్

నీలగిరి, మే 16 : నల్లగొండ పట్టణంలోని మాన్యంచెల్కలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ కొలను శివరాంరెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి 11 నుంచి శుక్రవారం ఉదయం 7 గంటల వరకు సుమారు 500 ఇండ్లలో తనిఖీలు చేపట్టారు. 8 మంది సీఐలు, 24 మంది ఎస్ఐలు, 80 మంది కానిస్టేబుళ్లు మొత్తం 320 మంది సిబ్బంది 28 చెకింగ్ బృందాలు, 18 కటాఫ్ బృందాలుగా ఏర్పడి అష్టదిగ్బంధనం చేశారు. ఈ ప్రాంతంలో పలువురు జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా నుంచి వలస వచ్చి ఉంటున్నట్లు గుర్తించారు.

ప్రతి ఇంటిలోని వాహనంతోపాటు ఆధార్ కార్డులను తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరి వివరాలు సేకరించి వారి ఆధార్ కార్డులతో ఆన్‌లైన్‌లో సరిచూసుకున్నారు. ఈ తనిఖీల్లో నలుగురు రౌడీ షీటర్లతోపాటు 30 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వీరికి గాంజా పరీక్షలు నిర్వహించగా ఎనిమిది మందికి పాజిటివ్ వచ్చింది. పత్రాలు సక్రమంగా లేని 165 వాహనాలను, నాలుగు ఆటోలను సీజ్ చేశారు. హుక్కా సెటప్‌ను, గాంజా చాక్లెట్ల స్వాధీనం చేసుకొని అక్రమంగా ఎయిర్ గన్ కలిగిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి మరోసారి కార్డన్ సెర్చ్‌లో దొరికితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో సీఐలు ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రాఘవరావు, ఆదిరెడ్డి, కొండల్‌రెడ్డి, నాగరాజు, రాజశేఖర్, కరుణాకర్, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, ఎస్ఐలు సైదాబాబు, వై.సైదులు, శంకర్, గోపాల్‌రావు, సందీప్‌రెడ్డి, మానస తదితరులు పాల్గొన్నారు.

### అనుమానితులపై సమాచారం ఇవ్వాలి : ఎస్పీ

కాలనీల్లో, ఇంటి ప్రదేశాల్లో అనుమానితంగా ఎవరైనా కనబడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రజలకు సూచించారు. ఇండ్లల్లో కొత్తగా కిరాయికి వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకున్నాకే అద్దెలకు ఇవ్వాలని తెలిపారు. నేరరహిత పట్టణంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రజలకు శాంతిభద్రతలు కల్పించాలని ఉద్దేశంతో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# భువనగిరి ఖిలా.. అభివృద్ధి డీలా..

- ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేసి ఏడాది పైనే..
- ముగ్గు పోయలేదే.. తట్టెడు మట్టి ఎత్తలే..
- రూ. 118 కోట్లు మంజూరైనా ఫలితం శూన్యం
- అభివృద్ధి చేస్తే ఎన్నో సొబగులు, సకల హంగులు
- రోప్ వే, రాక్ క్లైంబింగ్, స్కై వాక్ ఇంకా మరెన్నో..
- ఆశగా ఎదురు చూస్తున్న భువనగిరివాసులు

## నత్తనడకన 'కోట' పురోగతి పనులు

**ఓ వైపు పెద్ద స్క్రీన్. అందులో స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ. మరో వైపు ప్రజాప్రతినిధులు, అధికారులు. భువనగిరి అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన. అప్పుడే ఏదో జరిగిపోయిందన్న విధంగా అట్టహాసం. కట్ చేస్తే ఏడాది దాటినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఖిలా అభివృద్ధి ఆమడ దూరంలో నిలిచిపోయింది.**

– యాదాద్రి భువనగిరి, మే 16 (నమస్తే తెలంగాణ)

ఏకశిలపై నిర్మితమైన చారిత్రక కట్టడం భువనగిరి కోట. ఎన్నో పోరాటాలకు, చరిత్రకు సజీవ సాక్ష్యం. ఇది 147 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ కొండ దక్షిణం నుంచి చూస్తే తాబేలులా, పడమర నుంచి చూస్తే కూర్చున్న ఏనుగులా కనిపిస్తుంది. కొండపైకి వెళ్లేందుకు ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి మార్గాలు ఉన్నాయి. హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో పర్యాటకులను ఆకర్షిస్తున్నది. సెలవు దినాల్లో ట్రెక్కింగ్ నడుస్తున్నది.



ఖిలా ముఖద్వారం నమూనా

### నాలుగు దశల్లో

కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0 పథకంలో భాగంగా భువనగిరి ఖిలాను ఎంపిక చేసింది. ఖిలాను రూ.118 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. మొత్తం నాలుగు దశల్లో పనులు చేపట్టనుంది. ఇందు కోసం తొలి విడుతలో భాగంగా రూ.69 కోట్లు కూడా మంజూరు చేసింది. రూ.10.73 కోట్లతో రోడ్ల అభివృద్ధి, పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేస్తారు. రూ. 6.07 కోట్లతో ఎంట్రెన్స్ ప్లాజాను అప్‌గ్రేడ్ చేయడంతోపాటు సైట్ ఇంప్రూవ్‌మెంట్, పర్యాటక వసతులు కల్పించనున్నారు. రూ.4.30 కోట్లతో వారసత్వ కట్టడాల నిర్మాణ పనులు, రూ.12.18 కోట్లతో సౌండ్ అండ్ లైట్ షో, వసతుల కల్పనకు సుమారు రూ. 3 కోట్లు, ఐటీ ఇంటర్వేషన్‌కు రూ. 3.72 కోట్లు ఖర్చు చేయనున్నారు. రోప్ వే నిర్మాణానికి రూ.15.19 కోట్లు వెచ్చించనున్నారు. ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు పలుమార్లు భువనగిరి కోటను సందర్శించి అధ్యయనం చేసి డీపీఆర్‌ను రూపొందించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం చుట్టారు. రోప్ వే కోసం టెండర్ల ప్రక్రియ పూర్తయింది. భూ సేకరణ ఇబ్బందులు తొలగినట్లు తెలుస్తున్నది.



భువనగిరి ఖిలా..

### అభివృద్ధి చేస్తే ఆధునిక హంగులు..

భువనగిరి ఖిలాను అభివృద్ధి చేస్తే ఎన్నో ఆధునిక హంగులు, సొబగులు రూపుదిద్దుకోనున్నాయి. మొదటి దఫాలో రోప్‌వే, బేస్ క్యాంప్ సమీపంలో ఫుడ్ కోర్ట్స్, తదితర వసతులు కల్పించాలని నిర్ణయించారు. పునరుద్ధరణలో భాగంగా అడ్వెంచర్ అనుభూతులు పొందేలా ఖిలాను అభివృద్ధి చేయనున్నారు. ఖిలాపై నీటి కొలను పునరుద్ధరించనున్నారు. రాపెల్లింగ్, రాక్ క్లైంబింగ్, హైకింగ్, వాల్ క్లైంబింగ్, పెయింట్ బాల్, ఆర్టిఫిషియల్ వాటర్ ఫాల్, లిఫ్ట్ స్కైవాక్, ఓవర్‌నైట్ క్యాంపింగ్, మూన్ లైట్ డిన్నర్ సదుపాయాలు కల్పించనున్నారు. ఖిలాపై ఉన్న జైలును ఇంటగ్రేటేషన్ సెంటర్‌గా మార్చనున్నారు. ఫోర్ట్ ఏరియాను అభివృద్ధి చేయడంతోపాటు రెస్టారెంట్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇప్పుడున్న మెట్లను రెనొవేట్ చేయనున్నారు. గుట్టపై స్కల్పర్ గార్డెన్, రాక్ గార్డెన్, రోప్‌వే స్టేషన్, పార్కింగ్ ఏరియా, ఫుడ్ ప్లాజా, కన్వెన్షన్ సెంటర్ నిర్మించనున్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి రోప్‌వేను భువనగిరి ఖిలా పైకి ఏర్పాటు చేస్తుండటం, ఇప్పటికే యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం, తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధి చెందుతున్న స్వర్ణగిరి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్న నేపథ్యంలో అభివృద్ధి చెందిన భువనగిరి ఖిలాపైకి కూడా పర్యాటకుల రద్దీ పెరిగే అవకాశం ఉంది.

### మోదీ శంకుస్థాపనకే పరిమితం..

గతేడాది మార్చి 6వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఖిలా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భువనగిరి కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రధాని శంకుస్థాపన చేసి ఏడాది దాటినా ఇంకా పనులు ఊపందుకోలేదు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని త్వరగా పనులు పూర్తి చేయాలని భువనగిరి ప్రజలు కోరుతున్నారు.



భువనగిరి ఖిలా స్కైవాక్ నమూనా చిత్రం



అర్వపల్లిలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తూ వెళ్లిపోతున్న ఎమ్మెల్యే వర్గం

## కాంగ్రెస్‌లో 'సంస్థాగత' లొల్లి

- 2017కు ముందున్న వారికే అవకాశమని చెప్పడంతో ఘర్షణ
- కుర్చీలు విసిరి, రోడ్డుపై నిరసన తెలిపిన ఎమ్మెల్యే వర్గం

అర్వపల్లి : తుంగతుర్తి కాంగ్రెస్‌లో మరోసారి వర్గపోరు బహిర్గతమైంది. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అధ్యక్షతన జాజిరెడ్డిగూడెం మండల అధ్యక్షుడు, గ్రామశాఖ అధ్యక్షులు ఎన్నిక ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ నిర్వహించారు. దీనికి సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి మహబూబాద్ ఎమ్మెల్యే మురళినాయక్, ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొనాల్సి ఉంది. కానీ వారు రాక ముందే ఇరువర్గాల మధ్య గొడవ మొదలైంది. 2017 ముందు కాంగ్రెస్‌లో పని చేసిన కార్యకర్తలకు మాత్రమే సంస్థాగత ఎన్నికల్లో అవకాశం ఉంటుందని పార్టీ పరిశీలకుడు చెప్పడంతో ఘర్షణ చెలరేగింది. తమకు అవకాశం దొరకట్లేదు అని ఎమ్మెల్యే మందుల సామేలు వర్గానికి చెందిన కొందరు దాడికి దిగారు. కుర్చీలు ఎత్తేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే వర్గం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. దాడులకు దిగిన వ్యక్తులు ఇటీవల ఇతర పార్టీ నుంచి వచ్చి అరాచకాలు సృష్టిస్తున్నారని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ధరూరి యోగానందచార్యులు తెలిపారు. అరాచకాల్ని ఆపకపోతే ఎమ్మెల్యేకు ప్రతి గ్రామంలో నిరసన తప్పదని హెచ్చరించారు. ఇదే తరహాలో మోత్కూరులో జరిగిన కాంగ్రెస్ సమావేశంలోనూ గొడవ చోటు చేసుకుంది.



చిత్రియాల అటవీ ప్రాంతంలో సోలార్‌బోరును పరిశీలిస్తున్న సీఎఫ్ ఫీల్డ్ డైరెక్టర్ సునీల్ హిరామత్, అటవీ అధికారులు

## వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలు

- వేసవిలో దాహార్తి కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- కంబాలపల్లి రేంజ్ పరిధిలో పర్యటించిన సీఎఫ్ ఫీల్డ్ డైరెక్టర్ సునీల్ హిరామత్

చందంపేట, మే 16 : వన్య ప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు సెంట్రల్ సీఎఫ్ ఫీల్డ్ డైరెక్టర్ సునీల్ హిరామత్ అన్నారు. గురువారం రాత్రి చందంపేట మండలం కంబాలపల్లి రేంజ్ పరిధిలో సోమరిపాయ, రేకులవలయం, కంబాలపల్లి, చిత్రియాల అటవీ ప్రాంతాలను ఆయన అటవీ శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చిత్రియాల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్ బోర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో అటవీ జంతువులు జనావాసాల్లోకి రాకుండా దాహార్తిని తీర్చేందుకు సాసర్ పిట్స్(నీటి తొట్టి)లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వన్య ప్రాణులు, అటవీ జంతువులను గుర్తించడానికి ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనుమానిత వ్యక్తులు అటవీ ప్రాంతంలో సంచరిస్తే సమాచారం ఇవ్వాలని, వన్య ప్రాణులను వేటాడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్ డ్యామ్‌లను పరిశీలించారు. అటవీ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఎఫ్ఓ రాజశేఖర్ పెట్ల, ఎఫ్‌డీఓ సంగీత, ఎఫ్ఆర్ఓ ఎన్.భాస్కర్, డిప్యూటీ రేంజర్ సుమన్, సెక్షన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, విష్ణు, చంద్రకళ, బీట్ ఆఫీసర్లు ఉన్నారు.

## సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

నల్లగొండ సిటీ, మే 16 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26 వరకు సరస్వతి నది పుష్కరాలు జరుగనుండగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. పుణ్యస్నానాల కోసం వెళ్లే భక్తులు సౌకర్యార్థం ఉమ్మడి నల్లగొండ రీజియన్ పరిధిలోని 7 డిపోల నుంచి ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ జానిరెడ్డి శుక్రవారంఒక ప్రకటనలో తెలిపారు. వేలాది మంది భక్తులను పుష్కరాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, రీజియన్ నుంచి సుమారు 32 బస్సులు నడుపనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులను నడిపించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

### డిపోల వారీగా చార్జీలు ఇలా..

- దేవరకొండ డిపో నుంచి వెళ్లే డీలక్స్ బస్సులో పెద్దలకు రూ.1500, పిల్లలకు రూ.800
- కోదాడ సూపర్ లగ్జరీ బస్సులో పెద్దలకు రూ.1200, పిల్లలకు రూ.700
- మిర్యాలగూడ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సులో పెద్దలకు రూ.1500, పిల్లలకు రూ.800
- నల్లగొండ డిపో నుంచి డీలక్స్ బస్సులో పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.600
- నార్కట్‌పల్లి డిపో నుంచి డీలక్స్ బస్సులో పెద్దలకు రూ. 1000, పిల్లలకు రూ.600
- సూర్యాపేట డిపో నుంచి డీలక్స్ బస్సులో పెద్దలకు రూ.1100, పిల్లలకు రూ.600
- యాదగిరిగుట్ట డిపో నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులో పెద్దలకు రూ. 900, పిల్లలకు రూ. 500

## ఐఐహెచ్‌టీలో కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర చేనేత జౌళి శాఖ ఆర్‌డీడీ పద్మ

భూదాన్‌పోచంపల్లి, మే 16 : పదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న విద్యార్థులు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ)లో నిర్వహించే కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ సూచించారు. భూదాన్‌పోచంపల్లిలో దీనిపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ కోర్సులో అడ్మిషన్ తీసుకున్న వాళ్లకు నెలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,500, కేంద్ర ప్రభుత్వం రూ.5,000 స్టైఫండ్ ఇస్తుందని తెలిపారు. జనరల్ అభ్యర్థులు 17 నుంచి 23 సంవత్సరాలు కలిగి ఉండాలని, ట్రైనింగ్‌లో హాస్టల్, భోజన వసతి ఉంటుందని చెప్పారు. మూడు సంవత్సరాల కోర్సు అనంతరం గవర్నమెంట్ ఉద్యోగం తప్పనిసరిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్‌రావు, డీఈఓ రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చేనేత సహకార సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులు, నాయకులు అంకం పాండు, కర్నాటి పురుషోత్తం, కూరపాటి వెంకటేశం, వర్కాల వెంకటేశం, జోగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సన్నాలు కొనండి మహాప్రభో...

## తుంగతుర్తి మండలంలో సన్నాల కొనుగోళ్లు కరువు



తుంగతుర్తి బండరామారం గ్రామంలో కల్లంలోనే సన్న వడ్లు

- 500ఎకరాల్లో సాగు
- ఒక్క కొనుగోలు కేంద్రమూ పెట్టని అధికారులు
- ఐకేపీ కేంద్రాల్లో నెల రోజుల నుంచి పడిగాపులు
- దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రవాణా భారం

**తుంగతుర్తి మండలంలో సన్న ధాన్యం కొనుగోళ్లు కరువయ్యాయి. ఇక్కడి పలు గ్రామాల్లో దాదాపు 500కిపైగా ఎకరాల్లో రైతులు సన్నాలు సాగు చేశారు. చేతికి వచ్చిన ధాన్యాన్ని ఐకేపీ సెంటర్లలో పోసి నెల రోజులైనా కొనుగోళ్లు చేయడం లేదు. దాంతో సెంటర్ల వద్దే రైతులు నిరీక్షిస్తున్నారు. పక్క మండలానికి వెళ్లి అమ్ముకోవాలంటే రవాణా ఖర్చులు భారంగా మారుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గ కేంద్రమైన తుంగతుర్తిలోనూ సన్నాలు కొనుగోలు చేయకపోవడంతో రైతులు గోస తీస్తున్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

– తుంగతుర్తి, మే 16

అధికారుల సమన్వయ లోపమో, సన్న వడ్లు కొంటే బోనస్ ఇవ్వాల్సి వస్తుందనో.. సన్న ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం నెలకొంది. సాధారణంగా వానకాలంలో రైతులు అధికంగా సన్నాలు సాగు చేస్తుంటారు. ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడంతో ఈ యాసంగి సీజన్‌లోనూ కొందరు అవే రకాలు సాగు చేశారు. జిల్లావ్యాప్తంగా దాదాపు ఈ సీజన్‌లో 6.58 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం చేతికి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో కనీసం 50 శాతం.. 3.25 లక్షల మెట్రిక్ టన్నుల పంటనైనా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తారని లెక్కలు గట్టింది. కానీ, ఇప్పటివరకు 48వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో పరిస్థితి దయనీయంగా మారింది. కాళేశ్వరం జలాలు రాకపోవడంతో ఈ యాసంగిలో ధాన్యం దిగుబడి తగ్గింఇ. దాదాపు అన్నిచోట్లా వేల ఎకరాల్లో పంట ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. నానాపాట్లు కాపాడుకున్న కొద్దిపాటి పంటనైనా అమ్ముకుందామంటే కొనే దిక్కు లేకుండా పోయింది. తుంగతుర్తి మండలంలో అధికారుల నిర్లక్ష్యంతో సరైన రీతిన, సమయానుకూలంగా కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మెజారిటీ రైతులు ప్రైవేట్‌లోనే ధాన్యం అమ్ముకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రంతోపాటు ఒక మండలం కాగా ఇక్కడ సన్నబియ్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. తుంగతుర్తి మండలంలో 200 ఎకరాల్లో సన్న వడ్లు సాగు చేసినట్లు అధికారిక లెక్కలు చెప్తుండగా, వాస్తవానికి 500 ఎకరాలకుపైనే సాగు చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన ఎకరాకు 25 కింటాళ్ల చొప్పున లెక్కన చూసినా 12,500 క్వింటాళ్ల సన్న ధాన్యం పండింది. కానీ, ఈ మండలంలో సన్నాల రైతులకు ధాన్యం విక్రయించుకునే అవకాశమే లేకుండా పోయింది. రైతులు అధికారుల వద్ద ప్రస్తావిస్తే పక్క మండలమైన మద్దిరాలకు వెళ్లి అమ్ముకోవాలని సూచిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రోజుకు రూ.2,500 కిరాయి చెల్లించాల్సి వస్తున్నదని, కొనుగోళ్లకు ఎన్ని రోజులు పడితే అంత రవాణా భారం మీద పడుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రస్తుత ఉన్న ఐకేపీ సెంటర్లలోనో లేక ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసో సన్న వడ్లు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

### నెల రోజుల నుంచి చూస్తున్నా



14 ఎకరాల్లో సన్నాలు సాగు చేస్తే 60 పుట్లు వడ్లు పండినయ్. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుందామంటే మా మండలంలో సన్న వడ్ల కేంద్రం ఏర్పాటు చేయలేదు. ట్రాక్టర్లలో తరలించాలంటే ఐదారు ట్రాక్టర్లు కావాలి. లేదంటే లారీ పెట్టుకొని దూర ప్రాంతంలోని ఐకేపీ సెంటర్‌కు వెళ్లాలి. నాతో పాటు చాలా మంది రైతులది ఇదే పరిస్థితి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితులు లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు అన్నీ ఇబ్బందులే. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సన్న వడ్లను తుంగతుర్తి మండలంలోనే ఎక్కడో ఒక చోట కొనుగోలు చేయాలి.

**-ఉప్పునూతల రవికాంత్‌రెడ్డి, రైతు, బండరామారం, తుంగతుర్తి మండలం**

### ఎండ, వానకు అవస్థలు



నాకున్న నాలుగెకరాల్లో సన్న వడ్లు సాగు చేశాను. చేతికి వచ్చిన ధాన్యాన్ని ఊళ్లోని ఐకేపీ సెంటర్‌లో పోసి నెలరోజులైనా కొనే దిక్కు లేదు. ఎండ, వానకు అవస్థ పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి సన్న వడ్లు కొనాలి.

**-గొల్లపల్లి నాగయ్య, రైతు, రావులపల్లి, తుంగతుర్తి మండలం**



ఎన్జీకొత్తపెల్లి ఐకేపీ కేంద్రంలో లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

## ధాన్యం ఎగుమతులకు పడిగాపులు

- ఎన్జీ కొత్తపల్లిలో లారీలు రాక రైతుల ఇబ్బందులు

శాలిగౌరారం, మే 16 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాంటాలు పూర్తయినా లారీ లేక ఎగుమతులకు తిప్పలు తప్పడం లేదు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సి వస్తున్నది. శాలిగౌరారం మండలంలోని ఎన్జీకొత్తపెల్లి ఐకేపీ కేంద్రంలో ధాన్యం కాంటాలు వేసి సుమారు 2,700 బస్తాలను ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంచారు. మూడు రోజులైనా లారీలు రాకపోవడంతో బస్తాలు కేంద్రాల్లోనే ఉంటున్నాయి. అకాల వర్షానికి ధాన్యం తడుస్తున్నదని, వెంటనే ధాన్యం తరలించాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.